# మనిషి

టి. రామారావు



ఆ రోజు 'డీలక్స్' హోటల్ ముందు రద్దీగా వుంది.

ఆ రోజే కాదు. ప్రతిరోజూ ఆ హోటల్ ముందు రద్దీగానే వుంటుంది అందుక్కారణం ఆఫీసులకు వెళ్ళవలసినవారు, కాలేజీలకు వెళ్ళవలసినవారూ, బస్సుల కోసం అక్కడికొచ్చి నిలబడతారు.

సరిగ్గా తొమ్మిది గంటల సమయంలో నేను రోజూ ఆ హోటల్లోకి వెళతాను. మధ్యాహ్నం టీ యింటర్వెల్‌లో, సాయంత్రం ఆఫీసునుండి వచ్చేప్పుడుకూడా ఆ హోటల్లోకి వెళతాను. టీ త్రాగి ఒక సిగరెట్ వెలిగించుకొని బయట పడతాను.

—ఇది నాకూ ఆ హోటలుకూ వున్న అను బంధం

'డీలక్స్' హోటల్లో ఒక్కసారి టీ త్రాగితే మరెక్కడా త్రాగబుద్ధికాదు ఇది నేను హోటల్‌కి యిస్తున్న సర్టిఫికేట్ కాదు. జనవాక్యం.

రోజూలాగే ఆ రోజూ ఉదయం తొమ్మిది గంటల సమయంలో హోటల్లోకి వెళ్తూ పక్కకు చూశాను.

అలా చూడ్డం నా కలవాటు. అలా చూసి నప్పుడు నాకో దృశ్యం కనబడుతుంది. ఆ దృశ్యం నేను తిరుపతి వచ్చిన దగ్గరినుండీ చూస్తూనే వున్నాను అంతకు ముందు ఎప్పటినుండి వుందో నాకు తెలీదు.

అలా చూసినప్పుడు నా కగుపించే దృశ్యం ఇది—

హోటల్ ముందు కుడిప్రక్కగా ఒక ఎలక్ట్రిక్ స్తంభం వుంది. దాన్ని ఆనుకొని ఒక ముసలి మనిషివాడు వుంటాడు. వాడిముందు ఒక గుడ్డ పరచి వుంటుంది. ఆ గుడ్డమీద చిల్లర పైసలు పడివుంటాయి.

అస్థిపంజరంమీద కప్పిన గుడ్డలా ముడతలు పడ్డ శరీరం. ఆ ముడతల్లో ఎంతకాలంనుండో పేరుకుపోయిన మట్టి, తైల సంస్కారం లేని తల మాసిన గడ్డం. చిరిగి చివికిపోయిన అంగ వస్త్రంలాంటి ఆచ్ఛాదన వస్త్రం. ఇవీ ఆ ముసలి వాడిలో కనిపించే లక్షణాలు.

ఆ ముసలివాణ్ణి ప్రొద్దున్నే వాడి మనుమ రాలు వెంట తీసుకొస్తుంది. హోటల్ ముందు కూర్చోబెడుతుంది. వాడిముందో గుడ్డపరుస్తుంది. ఆ గుడ్డ నాలుగు మూలలా నాలుగు రాళ్ళు పెట్టి వెళ్ళి పోతుంది.

మళ్ళీ మధ్యాహ్నం వస్తుంది. వస్తూ వస్తూ యింత అన్నం తీసుకొస్తుంది. తినిపిస్తుంది వెళ్ళిపోతుంది.

మళ్ళీ సాయంత్రం వస్తుంది. చిల్లరపైసల్ని లెక్కపెట్టు కొంటుంది. గుడ్డతీసుకొని భుజాన వేసుకొని, ముసలివాణ్ణి చేయిపట్టుకొని నడి పించుకొని తీసుకెళ్ళి పోతుంది

ఇది రోజూ జరిగే తతంగం

ఆ రోజుకూడా నేను హోటల్లోకి వెళ్తూ ఆ ముసలివాణ్ణి చూడ్డం, ఆ ముసలి వాడు ఎలక్ట్రిక్ స్తంభానికి చేరగిలబడి వుండటం కని పించాయి.

"బాబూ! ధర్మం చెయ్యండి బాబూ! గుడ్డి వాణ్ణి. పైసా ధర్మంచేసి పుణ్యం కట్టుకోండి బాబూ!" అని అరుస్తున్నాడు.

హోటల్‌లోకి వెళ్ళేవాళ్ళూ, వచ్చేవాళ్ళూ, దారినపోయేవాళ్ళు ఇలా వున్నవాళ్ళు. వాళ్ళూ వీళ్ళూ - ధర్మం చేస్తూనే వున్నారు.

అయితే నేనెప్పుడూ వాడికి చిల్లికానీ ధర్మం చెయ్యలేదు.

అందుక్కారణం లేకపోలేదు. యాచించటమంటే నాకు అసహ్యం. యాచించటమే కాదు, అసలు బిచ్చ గాళ్ళంటేనే నాకు పరమ అసహ్యం

వీధుల్లో బిచ్చాల విడిగ తిరగడం. దారినపోయే ప్రయాణికులకు అడ్డగించడం, ధర్మం చేసేంత వరకూ విడిచి పెట్టకుండా వుండటం, ధర్మం చెయ్యక పోతే తిట్టడం - నాన్సెన్స్! ఇవన్నీ చూసి విసిగి పోయాను. అంతేకాదు. అసహ్యాన్నీ, కోపాన్నీ అధికం చేసుకొన్నాను.

అందుకే —

నే నెప్పుడూ ఏ బిచ్చగాడికీ 'యిదిగో' అని చిల్లికానీ ధర్మం చేసిన పాపాన పోలేదు.

ఆ రోజు మధ్యాహ్నం టీ త్రాగడానికి ఆఫీసు నుండి వచ్చాను (మా ఆఫీసు ఆ హోటల్‌కి చాల దగ్గర్లోనే వుందిలెండి )

ఈ సారి ముసలివాడు క్రిందపడిపోయి, మూల్గు తున్నాడు. వాడి ముందున్న గుడ్డమీద రోజుకంటే ఎక్కువే డబ్బులు ప్రోగయ్యాయి.

నేను హోటల్లోకి వెళుతుంటే బయట నిలబడిన

# అంతంలేని ఆవేదన

— దాట్ల నారాయణమూర్తిరాజు

నడి సంద్రంలో తెప్పలా,
బురదనీటిలో బొంద్రు కప్పలా,
ఈ ఊహాలోకంలో నేనెలా మనగలను!
నాలో అణువణువున ప్రజ్వరిల్లే ప్రళయాగ్నిని
చల్లార్చి, ఓదార్చే వారెవరు?
నాలో రగిలిన ఆవేశానికి కారణమేమని
ప్రశ్నించి, నన్నూరడించే వారెవరు?
నా అంతరాంతరాలలో వేధిస్తున్న తీరని బాధను
తెల్సుకొనే వారెవరు?
ఈ ఊహాలోకంలో మిగిలింది నే నొక్కణ్ణే!
రాబందుల చేతిలో కీలుబొమ్మలా,
బోయవాని చేతిలో పావురాయిలా,
కబంధుల హస్తాల్లో నలిగిన నీతిలా,
నా ఆవేదన అర్థం చేసుకునే వారెవరు?
నా 'ఆక్రందన' వినే వారెవరు?

* * *

అన్యాయాన్ని ఆరాధించే హస్తాలు అంతమయ్యే దేనాడు?
అవినీతి రెక్కలు విరచి, అంగడిలో
పెట్టి వేలాం వేసే దేనాడు?
పిల్లికి బిచ్చం పెట్టనివాళ్ళంతా, అధికారం నిలదొక్కుకుని
మంచిని, మానవతని, మధువులా సేవించే అధికారుల
ఆశా సౌధాలు, సమూలంగా శిధిలమయ్యే దేనాడు?
ఏనాడు?...ఏనాడు??...ఏనాడు???
ఈ ఊహాలోకంలో మిగిలింది నే నొక్కణ్ణే!
పెద్దవాళ్ళ చేతికి దొరకని పిడికెడు మెతుకుల్లా,
నిరుద్యోగి నిరాశా నిస్పృహల్లా,
ఈ ఊహాలోకంలో నే నెలా మనగలను!

---

వాళ్ళెవరో అనుకొంటున్నారు ...

"ఇక లాభం లేదు ముసలాడు చచ్చిపోతాడు. కాకపోతే నూనేవో కానేపో! అయినా ఎండాకాలం. ఒక్క ప్రాణం. ఎలా తట్టుకుంటాడ్లెండి" అని.

ఇవి కేవలం సానుభూతి వాక్యాలు మాత్రమే.

ఆ మాటలు విన్న తరువాత నే ననుకొన్నాను.

"వెధవలు. అలా సానుభూతివాక్యాలు పలక్కపోతే, ఆ ముష్టివాడి ముఖం మీద యిన్ని నీళ్ళు చల్లకూడదూ?" అని.

ఆ వెంటనే నన్ను నేను గుర్తుతెచ్చుకొన్నాను

వాళ్ళని తిడుతున్నాను. వాళ్ళు నీళ్ళు చల్లకూడదూ అని అంటున్నాను. మరి ఆ పని నేనెందుకు చెయ్యకూడదు? అలా చేస్తే నా అభిమానం దెబ్బతింటుందనా? అందరూ నన్ను వింతగా చూస్తారనా? మరెందుకు నేనా పని చెయ్యలేక పోతున్నాను.

ఆలోచించలేకపోయాను.

నాలో అభిమానం అడ్డొస్తుంది.

ఆఫ్టరాల్ ఒక ముష్టివాడ్ని గురించి నేనెందు కాలోచించాలి?

టీ త్రాగి, సిగరెట్ వెలిగించుకొని బయటికి వచ్చాను. ముసలివాడి చుట్టూ మూగిన జనం నెమ్మది నెమ్మదిగా పలుచబడింది ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతున్నారు. అంతేగాని ఎవరూ వాడి మొహంమీద యిన్ని నీళ్ళు చల్లలేదు. వాడి నోటికి యిన్ని నీళ్ళు అందించలేదు.

ఇంకా నేను మాత్రం హోటల్ మెట్లమీద సిగరెట్ పీలుస్తూ నిలబడే వున్నాను.

నేను రోజుకి మూడు నాల్గుసార్లు టీ త్రాగుతాను. కనీసం పెట్టెడు సిగరెట్లయినా కాలుస్తాను వారానికి కనీసం రెండు సినిమాలైనా చూస్తాను. ఇవన్నీ అవసరమైన ఖర్చులేనా? ఇన్ని ఖర్చులు చేస్తున్నవాణ్ని ఒక ముసలివాడికి ఒక పైసా ఎందుకు దానం చెయ్యలేకపోతున్నాను? ఇది నా అహంభావమా? లేక ముష్టివాళ్ళమీద నిర్లక్ష్య భావమా?

ఏమో తెలీదు.

నేను మాత్రం ఆలోచిస్తూనే వున్నాను.

ఇంతలో —

అటువైపునుండి నడుచుకుంటూ ఒక కుర్రాడు వచ్చాడు. వాడో ముష్టివాడు. మాసి అట్టకట్టుకుపోయిన నిక్కరూ, చిరిగిపోయిన చొక్కా, తైల సంస్కారంలేని తలా. ఇవీ వాడిలో కొట్టొచ్చినట్లు కన్పించే విశేషాలు. వాడు ముసలివాడి దగ్గరికి వచ్చాడు.

"తాతా! తాతా!" అంటూ పిలిచాడు.

తాత నుంచి సమాధానం లేదు

కుర్రవాడు గబుక్కున హోటల్లోకి పరుగెత్తాడు. డబ్బాతో నీళ్ళుతెచ్చి, ముసలివాడి ముఖంమీద కాసిని జల్లాడు

కాసేపటికి ముసలివాడు కదిలాడు.

"దాహం.దాహం" అన్నట్టుగా సైగచేశాడు.

ముసలివాడికి నీళ్ళు త్రాగించాడు ఆ కుర్రవాడు.

తాతా! అస్పత్రికి వెళదామా?" అని అడిగాడు కుర్రాడు. తాత పలకలేదు. దీనంగా ఆ కుర్రవాడి ముఖంవోకి మాత్రం చూడగలిగాడు తాత కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"వద్దులే బాబూ! వద్దు" అన్నట్లుగా సైగ చేశాడు.

"మరేం పర్వాలేదులే తాతా? నా దగ్గర డబ్బు లున్నాయిలే" అంటూ తాత సమాధానం కోసం కూడా ఎదురుచూడకుండా, గబగబా ప్రక్కనే వున్న రిక్షాస్టాండు దగ్గరికి పరుగెత్తి ఒక రిక్షాను తీసుకువచ్చాడు.

"రిక్షాబాబూ! కాస్తంత సాయం చెయ్యి బాబూ" అని రిక్షావాడిని అడిగాడు ఆ కుర్రాడు.

ఆ కుర్రవాడి పిలుపులో అభ్యర్థన వుంది

రిక్షావాడు కాదనలేకపోయాడు

రిక్షావాడూ, కుర్రవాడూ కలిసి ముసలివాణ్ణి రిక్షాలో కూర్చోబెట్టారు. కుర్రవాడు ముసలివాడ్ని పట్టుకొని రిక్షాలో కూర్చున్నాడు

ఇదంతా నేను గమనిస్తూనే వున్నాను

రిక్షా కదలబోతున్న సమయంలో, వుండబట్ట లేక ఆ కుర్రవాణ్ణి అడిగాను.

"అరేయ్ అబ్బీ! ఆ ముసలివాడు నీకేమవుతాడ్రా?" అని.

అందుకా కుర్రాడు చిన్నగా నవ్వి అన్నాడు ...

"మాలాగా బ్రతికే తోటిమనిషి బాబుగారూ" అని.

ఆ జవాబు విన్న నా మనస్సు వికలమై పోయింది.

ఆ కుర్రవాడూ మనిషే!

నేనూ మనిషినే!

కాని వాడికీ నాకూ ఎంత తేడా!

నేను చదువుకున్నవాణ్ని. ఉద్యోగం చేస్తున్న వాణ్ని. కాని - తోటి మనిషిమీద దయాదాక్షిణ్యాలు లేనివాడిని. తోటి మనిషిని ప్రేమించలేని, సమానంగా గౌరవించలేని వాడిని

కాని వాడు - ఆ కుర్రవాడు చదువు లేని వాడు. ఆఫ్టరాల్ ఒక బిచ్చగాడు అయితేనేం తోటి మనిషిని ఆపదలో ఆదుకునే మానవత్వం వున్నవాడు.

వాడికీ - నాకూ ఎంత భేదం!

అప్పుడనుకున్నాన్నేను -

"ఈ చదువూ, సంస్కారం ఎవరిని ఉద్ధరించడానికి? తోటి ప్రాణిని గౌరవించలేని, ఆదరించలేని - మనిషీ మనిషేనా?

నా మీద నాకే అసహ్యం కలిగింది. ★